# దర్శక బాబు

శ్రీ "సూర్యం"

★



"అబ్బ! బ్రదర్! నేటితో వదిలింది పురాణగాథల మీద పిచ్చ, పీడ" అంటూ ఒక దీర్ఘ నిట్టూర్పువిడిచాడు దర్శకబాబు.

"మీకే కాదండి ఆ పాడుపీడ వదిలింది" అన్నాడు సహాయ దర్శకుడు.

"లేకపోతే ఏమిటి భాయీ! వెధవ కవుల వర్ణన—" ఒక పురాణగాథని ఫిల్ముగా తయారుచేయాలంటే ఎంతో డబ్బు మింగేస్తుంది - విపరీత వ్యయ ప్రయాసలు - తలలు చిల్లులుపడే అపరిమితమైన తిట్లవర్షం ఓర్చుకోవడం - ఇంతా కష్టపడిన తరువాత ఫిల్ము రాణించలేదని ప్రజాకర్షణ పొందలేదని బాగా డబ్బుతేలేదని తెలుగుఫిల్ములు తెగులువచ్చి తగలెడుతున్నాయని యింతకూ కారణం దర్శకులు - ప్రొడ్యూసర్లు అంటూ రుద్దుతారు?" అన్నాడు దర్శకుడు.

"మరి అదేమి న్యాయమో? సబబో" అన్నాడు అదోవిధంగా సహాయ దర్శకుడు.

"అదిగాక, బ్రదర్! ఒక రావణుణ్ణి తయారుచేయాలంటే పది కిరీటాలు కావాల్సి, మనిషి ఒకడైనా" అన్నాడు దర్శకబాబు.

"అంతేనా! పది తలలు కావాలి,ఆ బరువుతో వాడి బుర్ర బద్ధలవడం" అని అందుకున్నాడు సహాయకుడు.

"అంతేకాదు ఆడవాళ్ల వర్ణన ప్రబంధాల్లో చూస్తే సరిగ గుప్పెడుకు సరిపోయే నడుము వుండాలట. ఎక్కడ తెచ్చేది? అంతటితో ఆగితే సరిపోయేది. లతాంగిగా వుండాలట! మరి తీగకు ఆధారం కావాలిగా! అంతేనా? తామర రేకులవంటి కళ్లు - తామర తూండ్లలాంటి చేతులు ఎలాగ చేసేది?" అని బట్టతలమీద చేయివేసికున్నాడు దర్శకబాబు.

"కృత్రిమంగా తయారుచేయాల్సిందే" అన్నాడు వికటంగా సహాయ దర్శకుడు.

"అందుకే యీ పాడు పీడా అంతా వదిలించుకుంటానికి సాంఘిక చిత్రంమీద పడ్డాను" అన్నాడు దర్శకబాబు.

"మంచిపని చేసారు!" కాని "ప్రజాభిప్రాయాన్ని తెలుసుకున్నారా?" అన్నాడు సహాయ దర్శకుడు.

"దానికేం తక్కువ గాని, అవును మరిచా. నిన్న వచ్చిన ఆ యిద్దరి చేడియల్లో కొంతం పర్సనాలిటి - జబ్బపుష్టి - అంగసౌష్టం చాల బాగుందికదూ కళా దృష్టితో చూస్తే......అన్నాడు దర్శకబాబు.

"విగ్రహంకూడా చాల బాగుంది. కంఠంకూడా ఎటు తిప్పితే అటు తిరుగుతుందిగ్గాని కొంచం సంస్కరణ పొందాలి కంఠం అన్నాడు సహాయ దర్శకుడు దర్శకబాబు

మొహంచూస్తూ. అంతటితో పూరికోక దాన్నంతా చక్క జేయటంలో డైరెక్టరు నేర్పరితనం కావాలి. అంతా డైరెక్టరు చేతిలోవుంది లెండి స్టార్ గా చేయాలంటే!"

"అయితే సినిమా స్టార్సు తెలిసికుంటారు స్టార్ వాల్యూని, యీ పరమ రహస్యాన్ని" అన్నాడు మొఖం తుడుచుకుంటూ తల సవరించుకుంటూ దర్శకబాబు ప్రజ్ఞకి గర్వపడినవాడిలా.

"ఆ! పేరు ప్రతిష్టలు గోటుగొప్పలు మంచి డైరక్షను క్రిందే వస్తుందని సర్వజన విదితమేగా" అన్నాడు సహాయ దర్శకుడు.

"నళినిమట్టుకు నటనలో—భావ ప్రకటనలో మంచి అభినేత్రేకాని, అంత అందంగా వుండదు. పాటలో మరి చెప్పాలా. కాని ఒక లోటు మంచి పర్సనాలిటి లేదు. కేరక్టర్ ఫిట్ నెస్ వుండదు. అయితే ఆమె చూపులో మెత్తనితనం అమాయకత్వం వుంది" అన్నాడు దర్శకబాబు.

"కలుపుకోలుతనంకూడా వుంది! మరి కాంతమో" అన్నాడు సహాయ దర్శకుడు.

"అబ్బో! కాంతం కళ్లలో ధిక్కారం ప్రజ్వరిల్లుతూ కళ్లుకోపాన్ని, రౌడీతనాన్ని చూపిస్తూ వున్నాయి" అన్నాడు దర్శకబాబు.

అయితే; "అలాంటిదే కావాలి" మనం తీయబోయే సాంఘిక చిత్రానికి కధానాయికగ"; ఆమె మూడు మూర్తులా సరిపోతుంది. చూపులోకూడ చంచలత్వం కనబడదు." అన్నాడు సహాయ దర్శకుడు నిర్మొగమాటంగా.

"చంచలత్వ మంటే?" అన్నాడు ఆతురతగా దర్శకబాబు.

అదేదో "టెక్ నికల్ వర్డు" లెండి. అది కవిని కనుక్కోవాలి. అది చంచలాతులదగ్గర సహజంగా వుంటుందట, కాని అలాంటిది మన కాంతంవద్ద మచ్చుకైనా కావాలన్నా కనబడదు అన్నాడు సహాయ దర్శకుడు.

"అయితే కాంతం వచ్చేవేళయింది మరి ఆమెను బుక్ చేయమంటావా" అన్నాడు గడియారం చూసుకొంటూ దర్శకబాబు.

"ఆ, హా! తప్పకుండా నేనే చేస్తే మంచిది కాని కంపెనీ పరువుతీసే స్టార్సని వెతకండి" అన్నాడు సహాయ దర్శకుడు వికటంగా!

"అలా ఎప్పుడూ చెయ్యను బ్రదర్" అంటూ భుజం తట్టాడు దర్శకబాబు.

... ... ...

"దర్శకబాబూ" వందనాలండి అంటూ వచ్చింది కాంతం.

చిరునవ్వుతో ఆహ్వానిచ్చాడు.

"రా, కూర్చో" అని కుర్చీ చూపించాడు దర్శకబాబు వోరకంటితో.

"సెలక్షన్లు ఎప్పుడండీ?" అంది కాంతం స్పష్టంగా.

"ఎప్పుడేమిటీ అనుకున్నప్పుడే" అని ఒక ఫేణుక్ విసిరాడు దర్శకబాబు.

అతని వైఖరికి అసహ్యించుకుంటూ ఫైనల్ వర్డు యివ్వండి అంది కాంతం.

"ఒక నిమిషం వుండండి" అంటూ చిన్న చిరునవ్వుతో ఒక సైట్ కొట్టి బైటకుపోయి అటూ యిటూ చూసాడు.

ఎవరు లేరు అనుకున్నాడు దర్శకబాబు.

"వీడు కామాతురుడుగా వున్నా" డంటూ ఒక తీక్ష్ణచూపు పారేసింది దర్శకబాబు మొఖాన్ని.

దాన్ని చిరునవ్వుతో అందుకొని, "యింతేకుముందు ఏ ఫిల్ములోనైనా యాక్టుచేసారా?" అన్నాడు దర్శకబాబు.

"లేదండి. కానీ అంతా యిదివరకే విన్నవించుకున్నానుగా" అంది కాంతం శాంతంగా.

"అయితే మీకు ఫిల్ము పరిశ్రమలో అనుభవం తక్కువ వుండవచ్చును." అన్నాడు దర్శకబాబు ఆమెను నిదానంగా చూస్తూ.

"అది వాస్తవమే" కాని నేను పనికిరానా? అంది కాంతం.

"అంతమాత్రానికే" అని దగ్గరకు వచ్చాడు ఆశతో.

"మరి ఏదో తేల్చండి పోవాలి" అంది కాంతం.

"బుక్ చేయొద్దా?" అన్నాడు ఒక వోరచూపుతో దర్శకబాబు.

"యిష్టపడితే" అంది సహజంగ కాంతం.

"యిష్టపడితేనే" అన్నాడు తమాషాగ కళ్లల్లో వికార వాంఛ కనపరుస్తూ దర్శకబాబు.

"...................."

"ఏమిటి! కళ్లు పొరలు క్రమ్మాయా?" అంది భగ్గున మండిన హృదయంతో కాంతం.

"మరి బుక్ చేయమంటావా" "వద్దా?" అన్నాడు దర్శకబాబు తుఫానులా రేగే కామోద్రేకాన్ని అణచ లేక అవస్థపడుతూ!

"ముందు నామీదవేసిన చెయ్ తియ్యి కామాంధుడా" అంది కోపంతో.

స్త్రీలమీద కోపంతో ద్వేషంతో పురాణాల్లో వర్ణించి వ్రాసినతిట్లన్నీ వొక్కుమ్మడి వర్షించాడు.

తనకు లోబడిన స్త్రీమీదే గౌరం లోబడకపోతే తిట్లూ అధికారాలు కదా!

"వట్టి నీచుడు" అంటూ వెళ్లిపోయింది కాంతం.

..........................

"దర్శకబాబూ!" అని కోకిలకంఠంతో పిలిచింది నళిని కళ్లు వోరగా పెట్టి ముద్దుగా ఆ పిలుపులో ఏదో ఆకర్షణశక్తి పెంకితనం వుందనిపించింది. వాంఛను రేపింది.

"హలో!" అన్నాడు దర్శకబాబు.

"కాంతాన్ని కధానాయిగ్గా వేస్తారటగా" అంది నళిని వచ్చీ రావడంతోటే ఒక షోకుతో చిలిపిగా.

"ఛీ! ఎవరన్నారు" అన్నాడు కామాన్ని క్రక్కుతూన్న మోహ కళ్లతో దర్శకబాబు.

"పబ్లిక్ టాక్ అలావుందండి" అంది కులుకుతూ వొయ్యారంగా తలత్రిప్పుతూ నళిని.

"పిచ్చివాళ్లు!" అని నవ్వాడు దర్శకబాబు.

"సరేకాని......అని ఏవేవో నొక్కుతూ నోరు సన్నగా విరుపుతో చంద్రవంకలాగుచేసి చిరునవ్వుతో; ఆ నవ్వులో రహస్యవాంఛల్ని రేపెట్టే స్నేహంతో వోర కంటితో అతనివంక చూస్తూ తీవిగా మాట్లాడింది.

"నీ పర్సనాలిటి అంత బాగుండలేదు" అన్నాడు తన్నుకొని వస్తూన్న కామవికారాన్ని ఆపుకోలేక.

"అయితే, బుకింగుకు పనికిరానా?" అంది నళిని మోహంతో ఆహ్వానిస్తూన్న సగంమూసిన కళ్లతో.

"అదే ఆలోచిస్తున్నా" అన్నాడు దర్శకబాబు ఆమె రొమ్ముకేసిచూస్తూ.

"చెలికత్తెగానైనా చూడండి" అని వొక సలాం కొట్టినట్లు అతి నాజూకుగా చూసింది.

"ఉండూ పోతావే అప్పుడే. కధానాయిగ్గా వేయాలని వుంది నిన్ను" అన్నాడు దర్శకబాబు సకిలిస్తూ.

"అంతా మీ యిష్టం నా భాగ్యం అంది ఒయ్యారంగా నిల్చున్ని జారిపోయిన పమిటను సవరించుకుంటూ.

"కూర్చోండి" అంత తొందరపడతారేమి అన్నాడు వుబికి పైకి పొంగుతూ వున్న జాత్యోద్రేకాన్ని కట్టివేయలేని స్థితిలో.

"కాంతం సంగతేమిటి" అంది నళిని.

"ఆమె పనికిరాదు" అన్నాడు పొంగుతూ.

"అయితే"—చమత్కారంగా పెద్ద నవ్వు నవ్వి నళిని—

"పంపేసాను" అన్నాడు సరదాగ దర్శకబాబు చిన్ని నవ్వుతో.

గాలికి తలుపులుమూసికున్నాయి. నాలుగు పెదాలు కలిసాయి.

"............"

అబ్బ లేండి! వొరక్కు...ఇంకొంచెంసేపు వుండు...

* * *

మరునాడు పత్రికల్లో మిస్ నళిని కధానాయిక— డైరక్టరు హాస్పిటలో జబ్బుతో పడివున్నాడు అని— ప్రకటన!

ఇంతలో కళ్లు తెరిచా: చతుర్థి చంద్రుడు రక్తంతో తడిచిన కొడవలిలాగు మేఘాల్లోంచి దూసుకొనిపోతున్నాడు.